

# బొమ్మల కొళాయి

ఎం. రామకోటి

రోడ్డువార గంప దించి, గాజువాకనుండి వచ్చే సిటీబస్సుకోసం యెదురు చూస్తోంది నూకాలమ్మ. ఎర్రమిరపకాయలు ఆరబోసినట్టు ఎండ చి(వ చి(వ లాడుతోంది. గొంతుక ఆర్చుకుపోతోంది. బొమ్మల కొళాయి కళ్ళల్లో ఆడి అలవాటుమీద అటు వేపు తిరిగింది. వేలాడే నల్లద్రాక్ష గుత్తుల్లా వుంగరాలుంగరాల జునపాలూ, ముద్దుబొద్దు చేతులూ - పాలడబ్బాలమీద బొమ్మల్లాంటి ముగ్గురు బుజ్జిగాళ్ళు దిసమెలలతో పూల గుత్తిలా వెనక్కివంగి, బూరిబుగ్గలు పూరించి, పుక్కిలించి చల్లని మంచినీళ్ల చివ్వన పిచికారీలలా చిమ్ముతూవుండే వారు. బీదాబిక్కి అందరికీ అందేది ఆ అమృతం. ఎండమావిలా తళుక్కుమన్న బొమ్మలు రెప్పపాటులో బేరంకోసం తహ తహలాడే రిక్షాలుగామారిపోయేయి. నిజాన్ని చూసి వుస్సురంది నూకాలమ్మ.

మొలలో కానీ కరువైన రోజుల్లో ఎకా ఎకిని ఏరాడకొండదిగి, వూళ్ళోకి రాగానే బొమ్మలు చిమ్మే నీళ్ళతో మొహం తడుపు కుని, గుక్కెడు నీళ్లుతాగి తట్ట నెత్తినేసుకుని కూలికిపోయేది. రోజులు మళ్ళి పోయేయి. మొల తడిమింది. బొత్తులు బొత్తులు నోట్లు వుబికి తొంగిచూసేయి. కిళ్లీ బడ్డీదగ్గరకు వెళ్ళి ధీమాగా సోడా కొట్టమంది.

"లచ్మీటాకీసు...బొమ్మల కొలాయి... దిగండిబాబూ ... దిగాల దిగాల"

ఇప్పు డా బొమ్మలకొళాయి నేతిబీర కాయ, బంగారు పిచ్చుక. అయినా ఆ స్థలాన్ని యింకా అందరూ బొమ్మల కొళా యనే అంటారు.

సిటీ బస్సు ఆగింది. గోళీ అడ్డుపడిన సోడాసీసా తిప్పి తిప్పి మరీ తాగుతున్న నూకాలమ్మ వులిక్కిపడింది. సగం సగం తాగి సీసా బడ్డీమీద పడేసి మొలలో చిల్లర దోపుకుంటూ గంపవేపు పరుగెత్తింది.

"పూర్ణామార్కెట్టు ...ఆ( ... ఎల్లమ్మ తోట... మేస్త్రీసీటుకోరుటు... ఆంద్రసిటీ... ఎక్కాలబాబూ ... రావాల్రావాల" అంటూ సిసింద్రీలాంటి కుర్రాడొకడు పుట్‌బోర్డుమీద నించుని పాసింజర్లని పిలుస్తూ, నాలికమడత బెట్టి వేళ్ళతో వూళలేస్తూ, బస్సుమీద దరువులు చరుస్తున్నాడు.

ఎక్కేవాళ్ళూ దిగేవాళ్లూ తొడదొక్కిడిగా వుంది బస్సు. గంప నెత్తికెత్తుకుని, చెయ్యూ డించుకుంటూ పీర్ల గుమ్మటంలా గునగున లాడుతూ బస్సుదగ్గర కొచ్చింది నూకాలమ్మ. ఎవరికోసమో బస్సంతా కలయజూసింది. చివరసీటులోవున్న షావుకారు గుట్టుగా కళ్ళతో పలకరించేడు. నిబ్బరపడి గంప బస్సులో ఎక్కించబోయింది.

"వస్తావేటి నూకాలప్పా ? ... సినో్న త్రేరూ..." అని నవ్వుతూ పలకరించేడు కండక్టరు.

"ఒస్తన్నన్రా గుంటపావడా ... పిచ్చా స్పటాలికి నిన్నంపించీయొద్దా? ... పరాసికా లాడతన్నడు గుంట సచ్చినోడు ... కొవ్వెక్కి నాగించీనా డికి రానా ? ఒస్తా నొస్తాను...దారికడ్డు నెగూ"

"గంపాగట్రా బండిలో ఎట్టడాని కీల్లేదు..."

"ఓ యబ్బో ... నీదేరాబస్సూ ... ! బొక్కిబస్సూ యీడూను...అడు నెగు... మక్కిలిరిసీగలును" అని గంప జబర్దస్తీగా బస్సులోకి తోసింది నూకాలమ్మ.

"గంపకి రూపాయవుద్ది...యిష్టమైతే ఎక్కు కష్టమైతే మానీ"

"ఆ( ... ముడ్డుముక్కిల్సేసీ ... నీకు దారోస్తాను."

"గంపిసిరి పారేస్తాను. ఏసికాలెయ్యకు"

"ఓర్నిన్ను పావు(పొడిసియ్యా"

బస్సు కదలడంలేదు. పాసింజర్లు విసుక్కుంటున్నారు. గొంతుక విడుతున్న కోయిలలా ఆగి ఆగి ఊళలేస్తూ చెవులు గంగిళ్ళెత్తించేస్తున్నాడు సిసింద్రీ.

"దాన్తోనేట్రా...దీ నెమ్మసిగ్గొయ్యా... బండికదల్నీదురాబాబూ...ఎక్కనీరా" అని గేరుమార్చి బుర్రు బుర్రు మనిపించేడు డ్రైవరు.

"ఏట్రోరి డైవోరూ? ... గుడ్డలగూబ నాగ మొకఁవూ నువ్వూను..."

"దండకం సాలే తల్లీ ... ఎక్కే ... నూకాల్తల్లీ ఎక్కే"

వుండబట్టలేక నవ్వేసేడు కండక్టరు. దుమ్ములేపుకుంటూ బస్సుకదిలింది. గంపలో గోనిమూట వుండ్రాళ్ళుమింగినట్టు గుండ్రంగా పూటుదేరి పిటపిట లాడుతూ సొంగలారుస్తోంది. తెల్లగా పిండి పైకిపొర్లుతోంది.

"దారికడ్డంగా ఎట్టేవేటే?...గంప సీటు కిందెట్టు," అని విసుక్కుంటూ గంపని సీటుకిందకి తొయ్యబోయేడు కండక్టరు.

"అదేం కొట్టినాదా తిట్టినాదా? ... దాని జోలి నీ కెందుకూ?"

"అడ్డుగుందే"

"దాటు కెల్లూ"

"నీ యబ్బగారి సొమ్ములాగ మాట్లాడతన్నవేటీ?...తీస్తావా యిసిరి పారేనా?"

"గూబలెక్కలాగీగల్ను ... గంపమీన సెయ్యితీయ్" అంటూ వీశడు వెండికడియం బరువుగా పైకెత్తి ఆడవాళ్ళసీటులో సద్దుకుంది నూకాలమ్మ.

ఒకరిమీదొకరు జోకులు విసురుకుంటూ, పకపకలాడుతూ, యూనివర్సిటీకి వెళ్తున్న పైలా పచ్చీసు అమ్మాయిలు నూకాలమ్మ రాగానే బిక్కచచ్చిపోయి మొహమొహాలు చూసుకున్నారు. పిల్లలకి పాలివ్వబోతున్నట్టు పొత్తిళ్ళలో పుస్తకాల్ని గుండెలకు అదుముకున్నారు.

"పుస్తకాలంత బరువునేరుగందా...మీరేటి సదూతారమ్మలూ!" అంది నూకాలమ్మ ఎదురుగుండా కూర్చున్న అమ్మాయితో మాటకలుపుతూ.

తనకన్నా పొడుగైన జువాలజీ రికార్డు నాజూగ్గా పట్టుకుని తెల్లవాయిలుచీర బుట్టగా చేసుకుని బాతులాకూర్చున్న అమ్మాయి సిగ్గుపడి ముడుచుకుపోయింది. ఆ సిగ్గుల అలజడిలో తడబడిన లోలక్కుల ముత్యాల జాలర్లు చెవుల్ని మూసేస్తున్న చింపిరి జడపాయలో చిక్కనబడ్డాయి. తల దించుకుని ఓరగా నవ్వుకుంటూ చిక్కువిప్పుకుంటోంది.

"వూరికే సొవులుమీనకి అంతనాగ దువ్వీసుకుంటే...సిక్కడిపోవూ? ... ఏటో రోజురోజుకీ మరీ..."

ఫక్కుమన్నారు అమ్మాయిలు.

"ఏటయిందనీ! ... నవ్వు వాలుగిదాల సేటంటరు."

మితిమీరుతోందని రుస రుస లాడుతూ నూకాలమ్మవేపు చూసేరందరూ. అన్నీ చూస్తున్న నూకాలమ్మ యిట్టే పసిగట్టేసింది.

"ఎర్రిముండనీ...నా నేటో బడబడ లాడతాను...ఏటనుకోమోకండి ... ఆంధ్ర సిటీలో సదుగంటే సంబడఁవేటీ? ... సదుగులు సదిగి రాజ్జిఁవేలండి ... సదూకున్న బుల్లెమ్మల్ని సూస్తేనే శాన కడుపు నిండిపోద్ది—" అంది ప్లేటు మార్చి పొగడ్తలోకి దిగుతూ.

రుసరుసలాడిన కాళికలు కళకళలాడే పార్వతులై పోయేరు.

"సేతి ఓసీ ఎంతేటమ్మగోరూ?"

"నూట ఎనభై"

"ఏటేటీ! నూట ఎనబయ్యే?...అవ్వ! మోసం...దగా పడిపోనారు...అందఁవా ఆకారఁవా?...దాని బాబునాటిది ... సూస్తారేటీ ... తొంబై రూపాలు ... అంతే ... తొంబై" అని గంపవేపు తిరిగి చూసింది, మండమీద కడియం యెత్తి కొప్పుసద్దుకుంటూ.

"సెయ్యి దించే నూకాలప్పా ... డబ్బుల్తియ్యి టిక్కట్టుకొయ్యాల" అని మధ్యలో వచ్చి టిక్కట్లు రెపరెపలాడించేడు కండక్టరు.

"నువ్వేట్రా మద్దినా ... పానకంలో పుడకనాగ?!...కొయ్యూ"

"డబ్బుల్తియ్యే ముందలా"

"సిల్లర్లేదు...రేపు సూసుకుందారిలే"

"రేపే ఎక్కుడుగానిలే...దిగు బస్సు"

"దిగను"

"ఏసికాలేస్తన్నవేటి నూకాలమ్మో ...! మరయితే గంపట్టుకెల్లుగాన్లే"

"ఓరెల్రా" అంటూ యూనివర్సిటీ అమ్మాయిల్తో వాచీలబేరంలో మునిగిపోయింది నూకాలమ్మ.

టయిమవలేదనో పాసింజర్లు లేరనో ఏదోవంకతో పూర్ణామార్కెట్టు దగ్గర బస్సువాళ్ళు యింజనాపి బీడీలు ముట్టించి రోడ్డుమీద పచార్లుచేస్తారు. పది పదిహేను నిమిషాలు బస్సు కదలదు ఆవేళప్పుడు.

"నూకాలప్పా!...నీ గంప దించేసినారే ... సూస్కో" అంటూ సీమమిరపకాయిలా చురక అంటించి సిసింద్రీ తీతికలా అరుచుకుంటూ వెళ్ళిపోయేడు.

"సొరసేపమింగియ్యా...ఒవుడ్రాడూ?" అని గతుక్కుపడి నడుంబిగించి నిప్పులు కక్కుతూ కండక్టరువేపు చూసింది నూకాలమ్మ.

బెదిరిపోయేడు కండక్టరు. నేను కాదు నేను కాదంటూ గంపవేపు చూపించేడు.

దిక్కూమొక్కూలేని బికారిలా రోడ్డువార గంప దిగులుపడిపోయింది. అధికారంలో టెక్కులాగ బిరుసెక్కిన ఖాకీనిక్కర్లో రెండుచేతులూ దోపుకుని, భగభగ మండిపోతున్న ఎర్రటోపీ దిక్కులు చూస్తోంది.

"నిన్నకాక మొన్నే గందరా వుపారఁవెట్టినానూ? మళ్లీ ఏఁ వొచ్చినా దియ్యాల నా గంపమీ దడావూ?" అని శాపనార్థాలు పెడుతూ పోలీసుమీద విరుచుకుపడింది నూకాలమ్మ.

"దేన్నారి దాన్నే ... ఎరువులకంపినీ దొరలూ రిపోర్టిచ్చినారు ... మా దొరగారు




పట్టుకోకతప్ప దన్నారు," అన్నాడు పోలీసు జవాను.

"నానే దొరికినానేటీ? ...అందికేనేట్రా బిల్లగుడుఁవుల్లాగ నీ ఎదాన్న గొట్టినాను."

"గంపెత్తుకుని పద ఠేసినికి."

"నీ ఒల్లకాట్లోకిరానా ... ఠేసినికి రావాలంట ... కవుఁరుకల్లు సచ్చినోడా," అని గంప లాక్కోబోయింది నూకాలమ్మ.

"పద ఠేసినికి...అన్నీ బయిటికొస్తయి.. ఏలుకి ఏలు యవ్వారాలు జరపడఁవూను... పదిరూపాయిలిచ్చిందంట..." అని గంప మీద చెయ్యి వెయ్యనియ్యకుండా లాఠీతో తోసేసేడు.

"ముద్దముద్దకీ బిసిమిల్లా ఏట్రా...నాకేటి మిగులుద్దీ? ... నీ యబ్బగోరిసొమ్ము నాగ గంప దించీసినావూ?

"ఆఁ ... నీ యబ్బగారిమూతే" అని వెక్కిరించి బిగిసిపోయేడు పోలీసు జవాను.

గెడ్డం పట్టుకుని బుజ్జగిస్తూ కాళ్ళబేరానికి దిగిపోయింది నూకాలమ్మ. అవేవీ లాభం లేదని పింగులేవేనా వుంటే చూడంటూ చూపుడు వేలుమీద బొటనవేలు మీటిస్తున్నాడు పోలీసు.

"టిక్కట్లు తీసుకోండి బాబూ...' సిల్లర తియ్యాల..." అంటూ టిక్కట్లు చింపుతూ డ్యూటీలో పడ్డాడు కండక్టరు.

"ఇంకా ఎంత సేపయ్యా బాబూ...ఎంత సేపు హాల్టు? ... కోర్టుకి టయిమయిపోతోంది," అంటూ బస్సు కదలడం లేదని ఉగ్రుడై పోతున్నాడు మేస్ట్రిటుకోర్టు గుమస్తా.

"ఇంకా మూడునిమషా లుందిబాబూ ... ముందుకదిలితే రూటు కేన్సిలయిపోతాది ... మమ్మల్నేటి సెయ్యమంటారు...టిక్కట్టు తీసుకోండి" పోలీసువేపు చూస్తూ గుమస్తాకి టిక్కట్టియ్యబోయేడు కండక్టరు.

"తీసుకుంటాను తీసుకుంటాను," అని దూకుడుగా పోలీసు దగ్గరకు వెళ్ళి.

"ఏవిఁటండీ మీ అల్లరి?...బస్సు కదలేల్నిస్తారాదా ... కొంపలు ములిగిపోతున్నాయవతల," అన్నాడు గుమస్తా.

"ఎల్లండీ...ఎవడొద్దన్నాడూ?"

"బస్సు కదలాలా?''

''నన్నేటి సెయ్యమంటరు...నే నాపినానేటి?''

''ఒవుడ్రా ఆపీసినాడూ ... నీ యింట పీనుగెల్లా..." అని రాజుకుంది నూకాలమ్మ.

"మాటల్సరిగ్గా రానియ్యే నూకాలూ ... అగ్గితో సెలగాటాలాడకు," అన్నాడు పోలీసు కళ్ళెర్రజేస్తూ.

"గంపని మీరూ వదల్రు ఆవిడా వదల్లూ...మరి బస్సెలా కదుల్తుంది? ... బావుంది బావుంది లాలోచీ."

"లాలోచీ ఏటండో ... దొంగ సరుకాగ్గీమంటారేటీ? డూటీ సెయ్యాల."

"ఓర్నీ జిమ్మడిపోనూ ... దొంగసరుకంట్రా ... డబ్బోసి కొనుక్కుంటే."

"దొంగసరుకా ... సాక్ష్యం వుందా? ... మీకేం తెలుసూ? దౌర్జన్యం కానీ..."

"అయ్యన్నీ అడగనాడికి మీరెవురండీ ... మాకు యినఫర్మేసనొచ్చింది ... మా యిస్టం."

"ఇష్టంటయిష్టం! ... నాన్సెన్స్! ... జులుం... వన్టౌనా టూటౌనా? నీ నెంబ

రెంత? ఏదీ?'' అని నోటుబుక్కు జేబులోంచి తీసి నెంబరుకోసం టోపీవేపు చూసేడు గుమస్తా.

"డూటీలో వున్నాను మీదికి రాకండి సార్ ... అడ్డురామోకండి సిక్కుల్లో పడతారు," అని టోపీ గబుక్కున తీసేసి వెనక్కి దాచేసుకున్నాడు పోలీసు.

డ్యూటీ చేస్తుంటే ఆటంకపరిచేడని ఏ కేసు బనాయిస్తాడో అని వెనక్కి తగ్గిపోయేడు గుమస్తా. కోర్టుకిరావా నీ పనిపట్టనా అనుకుంటూ బుసబుసలాడి వెళ్ళిపోయి బస్సెక్కి కూర్చున్నాడు.

"మీ కెందుకండీ మద్దినా? ఆల్లూఆల్లూ సూసుకుంటారు ... మామూలే" చివరసీట్లో కూర్చున్న షావుకారు బఠాణీగింజలు నోట్లోకి విసురుకుంటున్నాడు. తెప్పరిల్లేడు గుమస్తా.

"ఇంతజులుఁవా? ... చూస్తూ ఎలా వూరుకోమంటారూ?''

"ఏటి సెయ్యగల్రండీ?"

"టయిమయిపోతోంది...లేకపోతేనా... చూపిద్దును తడాఖా."

"ఆఁ ఆఁ...పోలీసంటే ఏటి? ... ఏటకుక్కలు ... మూసూసి మడుసుల్నిట్టే పసిగట్టేస్తరు.''

"ఏఁవిటండీ మీరనేదీ?''

"పాతమడుసులూ ...పాతసరుకూ బాబూ."

"పాతో కొత్తో ... రుజువూ సాక్ష్యం లేకుండా...బస్సులో సానూన్లు దించీడం ... ఆ బేరాలూ...అబ్బబ్బ!"

"బేరం లేన్దెక్కడ బాబూ...పెతీదానికీ దర...ఏటో మీ సేదస్తం గాని."

"ఘోరం."

"గోరఁవేమరీ..." అని గట్టిబారిన బఠాణీగింజ పటుక్కున కొరికేడు షావుకారు.

"ఇంతకీ ఏఁవుందనీ ... గంప దించడానికీ?" అన్నాడు గుమస్తా.

"కారం బాబూ," అన్నా రెవరో.

"కారఁవా!''

"మిరపకారంకాదండీ ..ఎరువులకారం.''

"ఎందుకూ? ... అదేదో బంగారం మూటలా మోసుకొస్తోందీ?''

"మేలిఁవి బంగారం...దానిగిరాకీ మీకేటి తెల్సూ?" అన్నాడు షావుకారు.

"పోలీ సెందుకు పట్టుకున్నాడూ?"

"ఎరువులు కంపినీలో పందికొక్కులు సేరి...మూటలు కొట్టేసి బుక్కుతుంటయి. దొడ్డిదారిన మోసుకొస్తయి లెండి ... అక్కడబజారు సవక," అన్నాడు షావుకారు.

"అదా సంగతీ! ... మీ కెలాతెలుసూ?" అని షావుకారువేపు గునపంలా గుచ్చిగుచ్చి చూసేడు గుమస్తా.

"మామూలే.'' చెక్కుచెదరకుండా పొగాకురెమ్మ సాపుచేసుకుంటున్నాడు షావుకారు.

"మామూలు మామూలు! చంపేస్తున్నావ్!...యిదేం మామూలయ్యా బాబూ?" అంటూ.

"పోలీసువారు డ్యూటీ చేస్తున్నారు చూడండి,'' అని అందరిదృష్టి పోలీసువేపు మరలించేడు గుమస్తా.

డబ్బుకోసం నూకాలమ్మ మొల తడిమేస్తున్నాడు పోలీసు. కసురుకుంటోంది నూకాలమ్మ. అందరూ నవ్వుకుంటున్నారు.

"ఓస్: మామూలే,''అని ఏఁవీ జరగనట్టు మామూలుగా చుట్టముట్టించేడు షావుకారు.

"కంచే చేనుమేస్తోంది...దిక్కేఁవిటి?"

"ఎవుడి దిక్కాడు సూసుకోడఁవే" ధీమాగా చుట్టపొగ పీల్చేడు షావుకారు.

డేంజరు లైటులాగ చుట్టకొస నుసిలోంచి ఎర్రగా గుప్పుమని చల్లారిపోయింది. డ్యూటీ అయిపోగానే అవతారం చాలించేడు పోలీసుజవాను. గంప చంకనేసుకుని నూకాలమ్మ బస్సులో అడుగుపెట్టిందో లేదో టయిమయిపోయింది. ఆదరాబాదరాగా బుర్రుబుర్రుమంటూ బస్సు బయలుదేరింది.

"ఎంత చదివించుకున్నావమ్మా?"గుమస్తా కుతకుతలాడుతున్నాడు.

"ఐదూ!...సుక్కురారం పూట యిచ్చ రూపాలు...ఆడిని ఎఁవులోడు మోసుకెల్లా ...లెగ్గానే ఒవుడిమొకం సూసినానో యియ్యాల...యింకెవుడు? ... యిదిగో... యీ సెట్టే.''

"ఇదేటిదేటి...నా నేటిసేసినాను మద్దిన? ...సెట్టంటే అనువూ...నెత్తిమీద తన్నిన సాయిబు నేవన్లేదంట అమ్మోరు...వూరవతల సెట్టిమీద యిరుసుకు పడిందంట ... నానే దొరికినానా'' షావుకారు మొర్రోమొర్రోమన్నాడు.

"అన్యాయం," గుడ్లెర్రజేసేడు గుమస్తా.

"అన్నేయం...గోరం...మహాగోరం'' గుండెలు బాదుకుంది నూకాలమ్మ.

"ఎందు కిచ్చేవు మరి?''

"గతినేక...ఆల్లసుట్టూ తిరిగితే నాబంగూబల్లో కొస్తది ... మడుసులఁవే మిగులుతాము...అయినా పన్లో బాబూ''

"పందికొక్కులు"

"గాదికింద పందికొక్కులు గాదికిందే బతకాలమరి...ఆల్లబతుకదీ మనబతుకిదీ... ఏటిసేస్తాం?"

"మంచిబతుకే.''

"నాసుగుబతుకూ ... కిలఁవూడితేగాని పలం దక్కదంట.''

"వూడిందిగా'' పళ్ళు కొరుకుతున్నాడు గుమస్తా.

"వూడక వుండిపోద్దా బాబూ? ... గంగమ్మ తల్లి బూదేవత గరబంలోంచి పొంగుకొస్తది...బొమ్మల కొలాయిలోంచి తస్సన తన్నుకొచ్చి కిందపడి ఆర్పుకుపోద్ది...మద్దిలో మోసెయ్యెత్తి అంకించుకున్నోడిది అదుస్టం ... దక్కినోడికి దక్కద్ది.''

"దిగమింగుతున్నాయి బొమ్మలు...పైకి చిమ్మడంలేదు" అన్నాడు గుమస్తా.

"బాగా సొప్పినావు...ఎక్కడ దక్కడే లోలోనే అరించుకుపోతంది తల్లి మాలచ్మి"

"నీతీ నిజాయితీ చచ్చేయి...హారతి కర్పూరంలా హరించుకుపోతోంది దేశం. ఎక్కడపడితే అక్కడ దగాలూ ... మోసాలూ...రామ రామా" ఎలక్షన్ల ముందు

ప్రజా ప్రతినిధుల భాష వల్లిస్తున్నాడు గుమస్తా.

''అయింది సాలు సాలు కానీ... యిప్పుడేనా గంప దార్లో తియ్యి నూకాలమ్మా... కబుర్లతో కడుపు నిండుద్దా.'' వాస్తవాన్ని జ్ఞాపకం చేసి చూచాయగా కర్తవ్యం బోధిస్తూ సీటుకింద తనమూట జాగ్రత్తగా సర్దుకుంటున్నాడు షావుకారు.

''అమ్మసెట్టీ!... అక్కడా దాసినావూ? గడుసునాకొడకడా!...అందికే కోటిరూపాలిచ్చైనా కొనుక్కోమన్నరు... ఓసీలూ పెన్నులూ ఎక్కడెట్టినా?!... సరుకు సీదాగా సేరినట్టేనా'' షావుకారు ఒళ్ళంతా తణిఖీ చేసేసింది నూకాలమ్మ.

బనీను దొంగజేబులు ఎత్తుగా తగిలేయి. నిబ్బరపడి శాంతించింది నూకాలమ్మ. గిలగిల లాడిపోయేడు షావుకారు కితకితలు పడలేక. గుమ్మయిపోయేడు గుమస్తా.

''అయితే సెంద్రమండలంలో మడుసులున్నారంటారా?'' బయట పడిపోయిన షావుకారు మాట మార్చబోయేడు దొంగ దగ్గు దగ్గుతూ.

''కొట్టు పెడతారా?'' తేరుకుని దెబ్బ కొట్టబోయేడు గుమస్తా.

'కానీ పరకా కలిసొస్తే... అబ్బెంతరం వేటిబాబూ...?''


''మీ మూటా అదేనా సెట్టిగారూ?''

మొహం ముడుచుకున్నాడు షావుకారు వులుకూ పలుకూ లేకుండా.

''దొంగ రవాణా!...స్మగ్లింగు!...పట్టపగలు పబ్లిక్ బస్సులో ... ఎంతధైర్యం!''

''పబ్లిగ్గా గుళ్ళూ గోపురాలూ మింగేసే వోల్లని ఏటీ అన్రేరు... ఆల్లు మారాజులూ. మాలాటి సిలకొట్లు మీదే నిగాలన్నీ... మాయిదావోల్లు... అనువుగా దొరికినోల్ల మీద పడిపోతరు.'' మెటికలు విరుచుకుంది నూకాలమ్మ.

''కుక్కలపాలైపోయింది దేశం.'' బాధపడిపోతున్నాడు గుమస్తా.




''నిచ్చేపంలాగుంది... దేశంవేటయ్యా. మడుసులో.''

''అవును... నీకేం తెలుస్తుంది... దొంగలు దొంగలు...పోలీసులు దొంగలు... ప్రజలు దొంగలు... అందరూ దొంగలే... ఛఛ'' నిస్పృహ పడిపోతున్నాడు గుమస్తా.

''ఎవురయ్యా దొంగలూ?... సిప్పుల్లోంచి దిగుతయి... ఆర్బారు దాటతయి... పెద్దపెద్దఆపీసర్ల నిగాలన్నీ దాటుకొస్తయి... సంతల్లో కలిసిపోతయి... ఆల్నట్టుకోలేరు మాంవాదొరికినాం?... సవుగ్గా దొరికినకాడ కొనుక్కుంటం, కానీ పరకా ఏసి అమ్ముకుంటం... ఆడికీ యీడికీ దిగతుడిసేసినాక మాకేటి మిగులుద్ది...? మాంవూ బతకాలా? కూకుంటేఎలాగడుస్తదీ?మడిసికోరుత్తే....''

''వృత్తా! బలే... దొంగరవాణా... మస్కాలూ వృత్తేనా?''

''ఎవ్వారం... నోకంతీరూ... ఏటూరికే యిదయిపోతన్నవూ?'' అని యీసడించింది నూకాలమ్మ.

మెడలో తోలుసంచి ఆడించుకుంటూ, వుండుండి చిల్లర గలగలలాడిస్తూ టిక్కట్లు చింపుతూ మధ్యకొచ్చేడు కండక్టరు. గతకలు దాటి, పోలీసు సూపరెంటు ఆఫీసుకి ప్రదక్షిణంచేసి, ఎల్లమ్మతోటలో కొన్ని క్షణాలుఆయాసంతీర్చుకునిబయల్దేరిందిబస్సు.

''మేస్ట్రీటు కోర్టుకియ్యండి'' చిల్లరకోసం పేంటుజేబులో చెయ్యి దోపేడు గుమస్తా.

''ఆం... తియ్యండి సెట్టిగారూ... సిల్లర తియ్యండీ'' షావుకారువేపు తిరిగి యీలోపున టిక్కట్లు చింపుతున్నాడుకండక్టరు.

చొక్కా వెనక బనీనులో మాయలమరాఠీ గుహల్లాంటి దొంగజేబుల్లోంచి పైసాలుతీసి లెక్కబెడుతున్నాడు షావుకారు.

''ఇరవైరెండు పయిసాలికి... తెగ లెక్కెడతన్నావు... పావలాకాసుంటే పడేవయ్యాబాబూ'' తొందరబెట్టేడు కండక్టరు.

''రెండుపైసలబిల్ల డీద్దావంనా?... ఆ పప్పు ల్నాదగ్గ రుడకవు'' బొటనవేలు పైకెత్తి పిడికిలి గిలకలాతిప్పేడు షావుకారు.

''సర్లేవయ్యా బాబూ... యిరవయిరెండే తియ్యి... బేగీరానీ...''

''యిరవయ్యే వున్నయి.''

''పావలా తియ్.''

''ముందు సిల్లర తియ్యా.''

''ఎల్లెల్లవయ్యా... పినాసోడా'' తోలు సంచి ఎత్తి కుదిపి చిల్లర తీసేడుకండక్టరు.

''నువ్వుమాత్తరం కాదేటీ?... ఏటో గడుస్తనం... యిదేం డబ్బా మన్నా!''

అన్నీ కనిబెడుతున్న గుమస్తా పేంటు జేబు తడిమి చూసుకున్నాడు. అర్ధరూపాయి పదిహేనుపైసలూ చేతికి తగిలేయి.

బస్సాగింది.

"మేస్ట్రీటు కోరుటు... దిగాలబాబూ దిగాల... ఆంధ్రసిటీ... సినోన్నిత్తేరు... రావాల్రావాలా" సిసింద్రీ ఊళలుకొడుతూ నానా హంగామా చేస్తున్నాడు.

ఎర్రగళ్ళ తువ్వాలుగుడ్డ తలకి చుట్టుకుంటూ, బూడిదరంగు కోరమీసాలు తిప్పుకుంటూ రివటకాడలాంటి మనిషొకడు గుమస్తానిచూసీ చూడగానే గుండెలు కవుక్కుంటూ కోర్టు వరండామీంచి పరుగెత్తు కొచ్చేడు.

"సల్లగా సెక్కేసినావా పంతులూ... అయిపునేకండా. ఎక్కడి కెలిపోనావయ్యా బాబూ... కల్లు కాయిలుకాసి పోనయి... యిడిసిపెట్టనేదు జైల్లో... ఆడకూతురు బెగిలిపోయింది..."

"ఆర్డరు పడిందిగా" అంటూ నిర్లక్ష్యంగా కండక్టరు చేతిలో పదిహేనుపైసలుంచి మందమరుపుగా దిగిపోతున్నాడు గుమస్తా.

"ఆడ్రడితేనో ...కాయితుం కదలొద్దూ? ఆకిటుకు నీసేతిలోనుంది... దేవుడొరఁ విచ్చినా నువ్వియ్యాలగంద బాబూ"

"కాళ్ళొస్తే అదే కదుల్తుంది...నన్నేం చెయ్యమంటావు ?"

"బాబ్బాబూ...ఆడగుంట జైల్లో చిక్కడి పోనాది... యింటికాడ నత్తానావాఁనూ... గగ్గోలుపెట్టేస్తరు. యియిగో అందాకా యీ అయిదూవుంచు... మిగతాది రేపీపాటికి పువ్వుల్లో పెట్టిచ్చేస్తను ... బాబ్బాబు" ప్రాధేయపడుతూ చేతులు నులుపుకుంటూ మడతలుపెట్టిన అయిదురూపాయల నోటు గుమస్తా చేతిలో పెడుతున్నాడు.

"ఎక్కడెక్కేరు బాబూ ?" పైసాలు చూసి లెక్కబెడుతూ అడిగేడు కండక్టరు.

"బొమ్మల కొళాయి."

"అయితే పదారు...మరోపైసారావాల"

"చిల్లరలేదు."

"వుంటది సూడండి."

"లేదయ్యా చెబుతుంటే నీక్కాదూ ?" విసుక్కున్నాడు గుమస్తా.

"యిదిగో ... యీ అయిదుపైసాబిల్ల సెల్లద్ది...మరోటియ్యండి."

"నిన్న నువ్విచ్చిందే"

"ఆహాఁ ...అలాగాబాబూ!... నిన్నే అడగలేపోరా ... యియ్యా మీకాడేవుంచుకోండి... పెతీఓడికీ బాగా అలవాటయిపోయింది... సెస్సె. పయిసాకాడ పితలాటకం" అని యీసడించుకుంటూ పదిహేనుపైసాలూ గుమస్తాచేతిలో నిసాకారంగా పారేసేడు కండక్టరు.

"మాటల్సరిగ్గా రానియ్యవయ్యా కండక్టరూ..టయిమయిపోతోంది లేకపోతేనా?.."

"అంత పౌరుసఁవుంటేడబ్బిచ్చీరాదూ?"

"ఇచ్చేస్తాఁవయ్యా యిచ్చేస్తాం...ఓఙ్ అప్పన్నా !"

"బాబ్బాబూ !...ఏటి సెలవు ?" అంటూ కోరమీసం రివటకాడ భయభక్తులతో ఆంజనేయులులాగ చిందులుతొక్కుతూ ముందు కొచ్చేడు.

"వాడిమొహాన పదహారుపైసలు పడీసిరా...మంచీలేదు మర్యాదాలేదూ...ఛఛ.." అంటూ వెనక్కితిరిగి చూడకుండా వెళ్ళిపోయేడు గుమస్తా. అయిదురూపాయల నోటూ పదిహేనుపైసలూ భద్రంగా పేంటుజేబులో దోపుకుంటూ.

జుబ్బా పక్కజేబీ తడుముకున్నాడు అప్పన్న గుడ్లు మిటకరిస్తూ. తప్పదనుకుని చిల్లర లెక్కబెట్టేడు.

"ఓరీడిబుద్ధి సంతకెల్లా !"... పేద్దసదా శారినాగ సొప్పినాడే కబుర్లూ !" దవడలు నొక్కుకుని తెల్లబోయింది నూకాలమ్మ.

మామూలే అంటూ అగ్గిపెట్టి యెరువడిగి ఆరిపోయినచుట్ట మళ్ళీ ముట్టించేడుషావుకారు.

ఎండ మండిపోతోంది. బిందెలు పట్టుకుని ఆడవాళ్ళు వీధికొళాయిదగ్గర రామరావణ యుద్ధానికి సిద్ధపడుతున్నారు. కుళ్ళుకాలవలో రేకుడబ్బా ఆడిస్తూ మంచినీళ్ళకోసం వెతుకుతున్నాడో దిక్కుమాలినవాడు. పీచుగట్టిపోయిన రాగిజుత్తుమీద ఆ పుణ్యోదకం జల్లుకుంటూ, వుండుండి పెదాలు తడుపుకుంటూ తాపం చల్లార్చుకుంటున్నాడు.

నీతీనిజాయితీ అని ధర్మపన్నాలువల్లించి అలసిపోయి ధీమాగావెళ్ళిపోయేడుగుమస్తా. ఒళ్ళుమండి, నోరెండిపోయిన నూకాలమ్మ కసితీరా సోడాకొట్టమంది. కంఙ్ కంఙ్ మని రెండింతలు కసితో పొగర్లుకక్కింది సోడాసీసా.

గుట్టుమట్టుగా అట్టడుగునే పాయలు పాయలై, వున్న వాళ్ళ యిళ్ళల్లో పువ్వుల వానగా, నవ్వులసోనగా విరిసి, కురిసి, జారిపారి, కుండీలలో నిండుకుని కుదుటబడి కులుకుతోంది – అందరికీ అందవలసిన జీవామృతం – భూగర్భంలో పండి, నిండి, చిమ్మిచిలికిన జీవనజల. అనూపానూ యెరిగిన గడుసువాళ్ళు అందినంత ఆచమించి దిగమింగుతున్నారు. తాడూ బొంగరం లేని అమాయకులు తెల్లబోయి ఆవురావురుమంటూ నాలికలతో పెదాలు తడుపుకుంటున్నారు.

నాజూకుగా దిగమింగే అదృష్టవంతులు అందమైన బొమ్మలు – డబ్బులుమింగే బొమ్మలు – లోకం కొళాయి – బ్రతుకే బొమ్మలకొళాయి.